# జేబుదొంగ

నీలం

మా ఆవిడమీద నాకేమి చెప్పడానికి ఇష్టం లేదు. చెప్పలేనని కాదు. కాని ఆమె కోప పడితే, అది గొప్ప నేరమా? కోపంరాని వాళ్ళెవరు? అందులో డాబుగాఉండాలనే నాకాంతకు ఎప్పుడైనా డబ్బులేకపోతే కొంచెం రేగుతుంది. నేనూ జాగ్రత్తగానే వుంటాను!

అది నెలాఖరు. డబ్బు ఎలాగ పోయిందో మాయమైంది కాని ఏమీకొన్నట్లు మాత్రంలేదు. ధరలు అంతఎక్కువ! కాంత ఎలాగో ఐదురూపాయలు అప్పుతీసి నాచేతికిచ్చింది.

"ఏం కావాలి?" అన్నాను. రేషన్ తెమ్మంటుందేమో అనుకున్నాను.

"షేవ్ పౌడర్ అయిపోయింది. ఒక డబ్బా 'కుటికూరా' తెచ్చిపెట్టండి"

"అంతేనా?"

"ఉండండి. ఒక సబ్బుముక్క, టూత్ పేస్ట్ తెండి". అని బాగా ఆలోచించి అంది.

"ఇన్ని తెస్తే రేషన్ కొనడానికి ఉంటుందా?" అని మెల్లగా అడిగేను.

"రేషన్! రేషన్!! 'ఏమిటండీ ఈ పాడు రేషన్! చూచుకొందాం శనివారంనాటికి"

నేను మరోమాట అనలేదు. సరే అని ఆనోటును పర్సులో ఉంచాను.

బజారువీధిగుండా వెళ్తున్నాను. సాయంకాలం కాబట్టి జనం ఎక్కువ. కొందరేమో కొనేవారు అంగటివాళ్ళతో బేరమాడుతున్నారు. కొందరు స్నేహితులందరు కూడి వీధినడుమ కార్లకు, మనుష్యులకు అడ్డంగా నిల్చొని బాతాఖానీ ఆరంభించారు. అక్కడ ఇక్కడ బిచ్చగాళ్ళు తమస్వరం సాగిస్తున్నారు. కుక్కలు, ఆవులు, మేకలు కొన్ని ఇలా అలా తిరుగుతున్నాయి. కార్లు అప్పుడప్పుడు 'రం' యి మని వెళ్తూంటే, జనం గొప్పగా శబ్దం చేస్తూంటే ఈ వింతలన్నీ చూస్తూ ఆనందిస్తూ వెళ్తున్నాను నేను.

అలాగ నడుస్తుంటే నన్నెవరో వెంబడిస్తున్నట్టు తోచింది. తిరిగి చూశాను. చాల బీదవాడు, చూడ్డానికి కొంత అసహ్యంగా ఉన్నాడు. తన దారి వెళ్ళుతున్నాడు కాబోలు ఆకష్టజీవి. అలా మొదట అనుమానించినందుకు విచారపడ్డాను.

అప్పుడు జరిగింది ఆవిషయం. నేనేదో అరటి తొక్కమీద కాలుంచాను కాబోలు. కాలు జారింది, అంచేత తప్పిపడబోయాను. ప్లాట్ ఫారమ్ కొనమీద పడబోయింది నాతల. అలా తగిలిందా ఖళ్ళున కొబ్బరికాయలాగ పగిలుండేది. నేనేం చెయ్యలేకపోయాను. నాకళ్ళు భయం చేత గిర్రున తిరిగాయి.

ఆసమయంలో రెండు దృఢమైన చేతులు నా నడుమును పట్టడంవల్ల నేను పడడం తప్పింది. లేచి నిలబడ్డాను. నావెనకాల వస్తుండే మనిషి నిలబడి, 'బలేగాజారిందే' అన్నాడు.

"ఔనండి! ఇలా నలుగురూ నడిచే చోట అరటిపండ్ల తొక్కు వేయడం మూర్ఖతనం అండి" అన్నాను. అతనిమీది నాఅనుమానం పూర్తిగా పోయింది. కాని నాగుండె దడదడ కొట్టుకో సాగింది. అతను తనదారి వెళ్ళాడు. నేనుమాత్రం ఒక్క నిమిషం నిలబడ్డాను.

అప్పుడు తోచింది జేబులో ఏదో బరువు తగ్గినట్టు. తాకిచూస్తే మనీపర్సు లేదు. పిడుగు పడ్డట్టు అయింది. తెల్లబోయాను. అక్కడెక్కడ పడి ఉండనూ లేదు, ఆమనిషి ఎక్కడో వెళ్ళి పోయాడు, అప్పుడు తట్టింది. జేబుదొంగ!

కాంతతో ఏం చెప్పను? జారిపడి గాయం తగిలుండినాపరవాలేదు. కాని ఆమెఆగ్రహానికి ఎలా తాళగలను, అప్పుడే ఆకాశంవిరిగి పడ్డట్టయింది.

ఏం చేయడం భగవంతుడా! అని పచారు చేస్తున్నా బజారు వీధిని. అప్పుడు దైవానుగ్రహం వల్ల సత్యం కనిపించాడు, ఐదు రూపాయలు పుచ్చుకున్నాను అతనివద్ద. అప్పుడు కొంతశాంతి వచ్చిందినాకు, అతనికి చెప్పాను జరిగిందంతా. అతడు ఆశ్చర్యంతో విన్నాడు,

"ఒరే మూర్తీ! ఆప్రక్కవీధిలో ఎవడో పట్టుబడ్డాడురా. అతని చింపిరి బట్టలు, ఆకారం చూస్తే బీదవాడుమల్లే ఉన్నాడు. అతనివద్ద ఐదు రూపాయల నోటు ఉందిరా. అంచేత......" అన్నాడు సత్యం.

"ఐదు రూపాయల నోటే? వాడు పట్టుబడ్డాడా? ఇప్పుడు ప్రాణంవచ్చిందిరా" అన్నాను.

"తొందరపడకురా! ఊర్లో 'కౌంటర్ ఫీట్' నోట్లు ఎక్కువగా ఉండడం నీకు తెలుసా? అంచేత పోలీసులెక్కువ జాగ్రత్తగానున్నారు. పోలీసువారు ఆమనిషిని అతనికెక్కడ ఆనోటు దొరికిందని అడుగుతున్నారు. ఎందుకో తెలుసా? అది 'కౌంటర్ ఫీట్ నోటు'!

ఓక్షణం అక్కడే ఆనడి బజారులో నలుగురు చూస్తుండగా మూర్ఛపోదా మనిపించింది.